

# శ్రీ వేంకటేశ్వర లీలలు

## అభీష్టప్రదాత

**శ్రీ జి. కృష్ణయ్య,**

**హైదరాబాదు.**

నా పేరు జి. కృష్ణయ్య. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేయు చున్నాను. నివాసము హైదరాబాదు.

శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ఈ సంవత్సరము వికాస తరంగిణి, సంతోష్ నగర్ 151 వ శాఖ హైదరాబాదు నుండి స్వామివారి బ్రహ్మోత్సవాలలో ''శ్రీవారి సేవ'' కార్యక్రమములో పాల్గొనే భాగ్యం నాకు లభించింది. గతరెండు సం లనుండి వెన్ను నొప్పి, మెడనొప్పితో బాధపడుతున్న నేను సునాయాసంగా శ్రీవారి సేవలో నిత్యాన్న దాన కార్యక్రమంలో పాల్గొని చాలా ఆనందించాను.

ఈ మధ్యనే మా చిన్న కుమారుడు చి జి.ఆనందరావు ఉద్యోగ ప్రయత్నంలో ఒక ఇంటర్వ్యూకు వెలుతూ ఆశీర్వాదము కోరాడు. యథాలాపంగా ఇష్టకామ్యార్థ ఫలసిద్ధిరస్తు అని దీవించి పంపాము. సాయంత్రం విచార వదనంతో కనిపించాడు. కారణం ఎం.టెక్., చదివిన వారికి అవకాశం ఇచ్చారని తను బి.టెక్. కదా అని విచారించాడు. అప్పుడు మాకు ఈ వారం గీతా జ్యోతి శ్లోక తాత్పర్యం స్ఫురించింది. త్రిదండి చిన్నజియ్యర్ స్వామివారి సంకల్పంతో గీతా జ్యోతి కార్యక్రమంలో తాత్పర్యాన్ని అనుగ్రహిస్తూ మార్జాల, కిశోర న్యాయాలను ఉటంకించారు. మేము కిశోర న్యాయంగా మా అబ్బాయిని ఇష్ట కామ్యార్థ ఫల సిద్ధిరస్తు అని దీవించామే! మార్జాల న్యాయంగా భగవదనుగ్రహప్రాప్తిరస్తు అని కదా! ఆశీర్వదించాల్సింది అని మా ఇలవేల్పు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పశ్చాత్తాప పడ్డాము. అలా అనుకున్న కొద్దిసేపటికే అత్యాశ్చర్యంగా మా అబ్బాయి ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నుండి ఫోన్‌చేసి -- నిన్నటి ఇంటర్వ్యూలో నన్ను కూడా



ఎంపిక చేసు కున్నారని ఎంతో సంతోషంతో నాకు ఈ శుభవార్తను వినిపించాడు. వెంటనే మా అబ్బాయి ఆ ఉద్యోగంలో చేరాడు. ఇదంతా ఆ శ్రీ వేంకటేశ్వరుని కృపే. మా కళ్ళు తెరిపించడానికి ఆ స్వామి కల్పించిన కరుణా కటాక్షాలు. తనను వేడికొంటే ఏదీ కాదనడు అని నిరూపించి మా అబ్బాయికి ఉద్యోగం ఇప్పించాడు.

మరునాడు హైదరాబాదుకు 20 కి.మీ. దూరాన గల చిల్కూరు శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధికి కుటుంబ సభ్యులతో వెళ్లడం జరిగింది. సరిగ్గా వారం రోజులకు మా పెద్ద కుమారుడు చి జి. ముకుందరావు ఎదురు చూస్తున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఎంపిక వార్తలు ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రచురితమై మా అబ్బాయి సెలెక్ట్ అయిన విషయం తెలిసింది. ఈ విధంగా మా ఇద్దరు కుమారులు ఒకేసారి ఉద్యోగ అవకాశాలు పొందడం నిజంగా ఆ ఏడుకొండలవాడి కరుణా కటాక్షాలే!

స్వామివారి కరుణా కటాక్షాలు లేనట్లయితే మా కుమారులకు ఆ అవకాశాలే వచ్చేవి కావు. ఇదంతా ఆ స్వామిలీలే! స్వామిని నమ్మినవారికి, స్వామిని ఆరాధించినవారికి, స్వామిని కోరుకున్న వారికి కొండంత వరాలనిచ్చే కలియుగదైవం ఆ శ్రీనివాసుడు.